ప్రజాశక్తి
శుక్రవారం 10 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



పింఛనుదారులకు ఇకెవైసి తప్పనిసరి

జిల్లా ఖజానా అధికారి ఆర్.ఎస్.కుమార్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛనుదారులందరూ తప్పకుండా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని, ఇ-కెవైసి చేయించుకోవాలని జిల్లా ఖజానా అధికారి ఆర్.ఎస్.కుమార్ తెలిపారు. హెర్బ్ యాప్ సాయంతో సంబంధిత పింఛనుదారుడు తన సిఎఫ్ఎంఎస్ ఐడికి ఇ-కెవైసి చేయించుకొని సంబంధిత వివరాలను ఉపఖజానా అధికారికి ఆన్‌లైన్లో సమర్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో తన ఆధార్ నంబర్‌కు లింకైనా మొబైల్ నంబర్లను మాత్రమే వినియోగించాలని చెప్పారు. లేకుంటే ఆధార్‌కు మొబైల్ నంబరును అనుసంధానం చేయించుకోవాలని పేర్కొన్నారు. జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా గానీ, హెచ్‌సిఎం పెన్షన్ లాగిన్ ద్వారా గానీ ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని పేర్కొన్నారు.



పట్టభద్రుల పోరు

- ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- 16న నోటిఫికేషన్
- 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న పరిశీలన
- ఉపసంహరణ గడువు 27
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- అమల్లోకి ఎన్నికల కోడ్
- ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో ప్రధాన రాజకీయ పార్టీలు
- పిడిఎఫ్ అభ్యర్థిగా డాక్టర్ రమాప్రభ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ (పట్టభద్రుల) ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది. దీంతో ఎన్నికల కోడ్ 3 ఉమ్మడి జిల్లాల్లో గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. విశాఖపట్నం పట్టభద్రుల నియోజకవర్గంలో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు (కొంత భాగం), అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఈ ఎన్నికలు జరుగనున్నాయి.

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా 23న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. 24న నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువుగా నిర్ణయించారు. మార్చి 13న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. మార్చి 16న కౌంటింగ్ జరుగనుంది.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రధానమైన రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించాయి. విశాఖ జిల్లా నుంచే ప్రధానంగా అభ్యర్థులంతా బరిలో ఉండడం విశేషం. వైసిపి అభ్యర్థిగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, టిడిపి అభ్యర్థిగా డాక్టర్ వేపాడ చిరంజీవిరావును, బిజెపి మద్దతు సిట్టింగ్ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ పోటీ చేయనున్నారు. 250 ప్రజా సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలోకి దిగారు. ఈమె అభ్యర్థిత్వాన్ని సిపిఎం బలపరుస్తోంది. అధికార పార్టీ అండతో వైసిపి బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపుకోసం అన్ని శక్తులనూ ఒడ్డుతుండగా, టిడిపి బలపరచిన డాక్టర్ చిరంజీవిరావు పేరును అత్యంత ఆలస్యంగా ఆ పార్టీ వెల్లడించింది. ప్రధానంగా అధికార వైసిపి అభ్యర్థిత్వంపైనా, బిజెపి సిట్టింగ్‌పైనా సొంత పార్టీల్లోనే వ్యతిరేకత పలు తరగతుల నుంచీ వ్యక్తమవుతోంది. మాధవ్ గెలిచి ఉత్తరాంధ్రకు ఏ విషయంలోనూ న్యాయం చేయలేకపోయారన్న విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. సొంత పార్టీలోనూ ఇదే వ్యక్తమవుతోంది. అధికార వైసిపి అభ్యర్థి సుధాకర్ ఓటర్ల చేర్పింపు నుంచి ఇప్పటి వరకూ ప్రలోభాలతో గట్టెక్కే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఈయన ప్రభుత్వ వ్యవస్థలన్నిటినీ వినియోగించుకుని, దొంగ ఓటర్లను చేర్పించి లబ్ధిపొందాలని చూస్తున్నారంటూ పలువురి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఓటర్లు, బూత్‌ల వివరాలు

మొత్తం పోలింగ్ బూత్‌లు	మొత్తం ఓట్లు	మహిళలు	పురుషులు	ట్రాన్స్‌జెండర్లు
293	2,83,751	1,48,025	1,78,796	40

ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థి ముందంజ

ప్రోగ్రెసివ్ డెమోక్రటివ్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరపున నిలబడ్డ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలన్నిట్లోనూ సామాజిక కార్యకర్తగా పలు కార్యక్రమాలతో 30ఏళ్లుగా అన్ని తరగతుల దృష్టినీ ఆకర్షిస్తూ వస్తున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో నిస్వార్థంగా, నిజాయితీగా, ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై కృషి చేస్తున్న తీరు, ఆమె సొంత పాపులారిటీతో పాటు ఈ ఎన్నికల్లో కలిసొచ్చే అంశంగా ఉంది.

ఉత్తరాంధ్ర ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలపైనా, ఎపి విభజన తర్వాత ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయంపైనా ఆమె తరచూ విశాఖ కేంద్రంగా తన గళాన్ని వినిపిస్తూ ఉండడం మరో ప్రత్యేకతగా ఉంది. రైల్వేజోన్ సాధన, పోలవరం, సుజల స్రవంతి రావాలని కోరుతూ పలు కార్యక్రమాల్లో ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఈ తరగతులకు మద్దతుగా నిలిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం ప్రజల గొంతుకగా చట్టసభల్లో వినిపించేందుకు రమాప్రభ సన్నద్ధమవుతున్నారు.

నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలు

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గురువారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.సూర్యకుమారి తెలిపారు. షెడ్యూలు ప్రకారం ఈనెల 16న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందని, నామినేషన్ల దాఖలుకు 23వ తేదీ చివరిరోజు అని తెలిపారు. 24న నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీగా నిర్ణయించారని తెలిపారు. మార్చి 13న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, మార్చి 16న ఓట్ల లెక్కింపు వుంటుందని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించినందున ఈనెల 9 నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులంతా ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాల్సి వుంటుందన్నారు. కోవిడ్ నియంత్రణ చర్యలు పాటిస్తూ ఎన్నికలు నిర్వహించేందుకు తగిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు రాజకీయ పక్షాలతో సమావేశం

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశంలో 1400 కు పైగా ఓటర్లు వున్న చోట, కాస్త తక్కువగా వున్న చోట అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చించి ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. మరికొన్ని పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పుపై కూడా సమావేశంలో చర్చిస్తారని పేర్కొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు, రైతుసంఘాల నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై రైతుల ఆందోళన

- రైతుకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్
- జిల్లా ప్రధాన తపాలా శాఖ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం పెట్టిన రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూలమెన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన గురువారం జిల్లా తపాలా శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు లోకవరపు ఆదినారాయణ, రైతు సంఘం నాయకులు డేగల అప్పలరాజు, గ్రీన్ ఫీల్డ్ రహదారి పోరాట కమిటీ కన్వీనర్ గులిపిల్లి గంగు నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగంపై కక్షకట్టినట్లుగా వ్యవహరిస్తోం దన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్ లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీ ఎత్తున నిధులు తగ్గించారన్నారు. ఒకవైపు దేశవ్యాప్తంగా రైతులు, రైతు సంఘాలు మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతులు పండించిన అన్ని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతుండగా, దానికి పూర్తి భిన్నంగా కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)కి కేవలం రూ.లక్ష రూపాయలు మాత్రమే కేటాయించిం దన్నారు.

మార్కెట్ ఇంటర్ వెర్షన్ స్కీమ్‌కు గత ఏడాది రూ.1,500 కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేవలం ఒక కోటి రూపాయలు మాత్రమే కేటాయించడమే గాక ఈ పథకాన్ని రద్దు చేయనున్నట్లు ప్రతిపాదించా రన్నారు. కేంద్ర ప్రభుత్వం తన రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల ఆలోచనలు మార్చుకొని పంటలకు మద్దతు ధరల వ్యవస్థను పటిష్టం చేసేల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు రామమూర్తి, రవి, నాగేశ్వరరావు, పెంటయ్య, కృష్ణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోడింగ్‌తో ఉద్యోగావకాశాలు

విజయనగరం : కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కోడింగ్ ద్వారా భవిష్యత్తులో ఉద్యోగావకాశాలను మెరుగుపర్చుకోవచ్చని బ్రైనోవిజన్ సిఇఒ గణేష్ నాగ్ తెలిపారు. గురువారం సీతమ్ కాలేజీలో 'టెక్నికల్ ఇంటరాక్టివ్ సెషన్ విత్ బ్రెయిన్ ఓ విజన్' అంశంపై సెమినార్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మాక్రో ఇన్ఫర్మేషన్ అనాలసిస్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయని చెప్పారు. అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. సీతమ్ విద్యార్థులతో 'స్మార్ట్ విజయనగరం'పై ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు. అనంతరం సీతమ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్‌రావు మాట్లాడారు.

జిఒ 5 ప్రకారం జీతాలు పెంచాలి

కెజిబివి ఉద్యోగుల డిమాండ్ ● జిల్లా వ్యాప్తంగా నల్ల రిబ్బన్లతో నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, వేపాడ, భోగాపురం

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మినిమం టైం స్కేలు జీవో నెంబర్ 5 ప్రకారం జీతాలు పెంచాలని ఎపి సమగ్ర శిక్ష అభియాన్ కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.అప్పలసూరి, బి.కాంతారావు, నాయకులు భారతి డిమాండ్ చేశారు. జీవో 5 ప్రకారం కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సిలో ఇచ్చిన 23శాతం జీతం పెంచడాన్ని వారు ఖండించారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా అన్ని కెజిబివిల వద్ద గురువారం నల్ల రిబ్బన్లు కళ్లకు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీతాలు పెంపుదలలో పార్ట్ టైం, గెస్ట్ టీచర్లకు సంబంధించి ఏ రకమైన విషయాన్ని చెప్పకపోవడంతో పార్టుటైం, గెస్ట్ పద్ధతులో పనిచేస్తున్న టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 2018లో గత ప్రభుత్వం ఇచ్చిన ఎంటిఎస్ జీవో నెంబర్ 24ను విడుదల చేసిందని, అప్పటినుండి కెజిబివి బోధన సిబ్బందికి జీతాలు పెంచాలని అనేక పోరాటాలు చేశామన్నారు. టీచర్లు ఆందోళన, అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకుండా 23శాతం జీతాలు పెంచామని చెప్పి టీచర్లకు అన్యాయం చేశారని అన్నారు. బోధనా సిబ్బందికి హెల్త్ కార్డులు, మెడికల్ లీవ్‌లు లేవని తెలిపారు. మహిళలకు ఇస్తున్న ప్రత్యేక సిఎల్ఎస్ కూడా కెజిబివి టీచర్లకు వర్తింపజేయలేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జిఒ 5 ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.


కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న కెజిబివి ఉద్యోగులు

ఆ ఇద్దరిపై చర్యలు తీసుకోవాల్సిందే

- లేకుంటే పిల్లల్ని పంపించం : తల్లిదండ్రులు
- పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థులు
- అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కోన ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు గురువారం మొహం చాటేశారు. బుధవారం నాటి సంఘటనకు బాధ్యులైన స్థానిక ప్రధానోపాధ్యాయుడ్ని, మధ్యాహ్న భోజన నిర్వాహకులపై చర్యలు తీసుకుంటేనే పిల్లలను బడికి పంపిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు ఖరాఖండీ చెప్పేశారు. గురువారం ఉదయం ఎంఇఒ మల్లేశ్వరరావు పాఠశాల విద్యార్థులు, విద్యా కమిటీ తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లలను బడికి పంపించాలని ఎంఇఒ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అయితే బుధవారం అస్వస్థతకు గురైన విద్యార్థులు కొంతమంది గురువారం కూడా కడుపునొప్పితో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు తప్ప ఇంతవరకు నోటి మాట ద్వారా కూడా చర్యలు ఊసెత్తలేదని ముక్తకంఠంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తాగునీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడతామని, పాఠశాలల పరిశుభ్ర వాతావరణం నెలకొల్పుతామని ఎంఇఒ ఎంత నచ్చచెప్పినా తల్లిదండ్రులు వినకపోవడంతో సమావేశం ముగించారు. పాఠశాలకు ఉపాధ్యాయులంతా హాజరైనప్పటికీ విద్యార్థులు లేకపోవడంతో పాఠశాల బోసిపోయింది.


అభ్యంతరం తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆహార భద్రత, మిడ్డే మీల్స్ అధికారుల సందర్శన

జిల్లా ఆహార భద్రత అధికారి పి.వెంకటరమణ, మధ్యాహ్న భోజనం సహాయ సంచాలకులు సుమా భాను గురువారం స్థానిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బుధవారం ఘటనలో బాధితులైన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచే మాట్లాడారు. విద్యార్థులు తీసుకున్న ఆహారంలో ప్రస్తుతం నిల్వ ఉన్న బియ్యం, గుడ్లు, వంట నూనె, తాగునీటిని పరీక్షల నిమిత్తం నమూనాలను సేకరించారు. అనంతరం ఆహార భద్రత అధికారి బాధిత విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుడ్లు వండిన ఆహారంపై సరైన నిర్వహణ లేదంటూ విద్యార్థుల వారి ముందు వాపోయారు. మిడ్డే మీల్స్ అధికారి సుధా భాను స్థానిక ప్రధానోపాధ్యాయులు జయరాంను, మిడ్ డే మీల్స్ నిర్వాహకులు లక్ష్మిని ఘటన జరిగిన తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నివేదికను జిల్లా కలెక్టర్‌కు, డిఇఒకు అందజేయనున్నట్టు తెలిపారు.

షోకాజ్ నోటీసులు ఇస్తాం

బుధవారం కోన పాఠశాలలో జరిగిన ఘటనపై సంబంధిత పాఠశాల హెచ్ఎం, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నోటీసులు ఇవ్వనున్నట్టు ఎంఇఒ పి.మల్లేశ్వరరావు విలేకరులకు తెలిపారు. వారికి లిఖితపూర్వక వివరణ అనంతరం జిల్లా అధికారులకు అందజేయడం జరుగుతుందని ఉన్నతాధికారులే మిగతా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు ఈ కార్యక్రమంలో జిల్లా సిబ్బంది కే రంగబాబు మణికంఠ తదితరులు పాల్గొన్నారు

ఫైలేరియాను తరిమికొట్టాలి

కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

మల్టీ డ్రగ్ మందులను వినియోగించి ఫైలేరి యాని పూర్తిగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో జిల్లా వ్యాప్తంగా డిఇసి, అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. గురువారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలందరికీ ఒకేసారి మాత్రలు వేయించాలని సూచించారు. సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఎస్‌టి వెల్ఫేర్, గురుకుల వసతి గృహాలలో, పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో ఉద్యమంలా పంపిణీ జరగాలన్నారు. డ్రాపవుట్ విద్యార్థులకు వాలంటీర్ల ద్వారా పంపిణీ చేసేలా చూడాలన్నారు. నగరాల్లో మున్సిపల్ కమిషనర్లు కీలక పాత్ర వహించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా పాల్గొనేలా చూడాలని కోరారు. మొదటి రోజే 99 శాతం పూర్తి కావాలని, మిగిలిన రెండు రోజులు మ్యాపింగ్ కార్యక్రమం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు డిపిఒ సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో అన్ని చోట్ల మాత్రలు మింగించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మలేరియా అధికారి తులసి, జిల్లా పరిషత్ సిఇఒ అశోక్ కుమార్, డిఎంహెచ్ఒ రమణకుమారి, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, సోషల్ వెల్ఫేర్ డిడి రత్నం, డిఇఒ లింగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పుణ్యగిరి అభివృద్ధికి అడ్డంకులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన పుణ్యగిరి ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కార్తీకమాసం, శివరాత్రి పర్వదినాల్లో పుణ్యగిరి కొండకు వేలాదిగా యాత్రికులు తరలివస్తారు. వీరికి ప్రధానంగా కావాల్సిన కొండపైకి దారి ప్రతి ఏటా ఇబ్బందికరంగా మారి యాత్రికులు ఆపసోపాలు పడుతున్నారు. మహిళా భక్తులకు మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు లేక వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. వీటి ఏర్పాటుకు ఎన్నో ఏళ్లుగా పాలకమండళ్లు ప్రయత్నిస్తున్నా పలు అడ్డంకులు ఎదురవుతూ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయి. ఈ ఏడాది శివరాత్రి వేలాదిగా తరలివచ్చే యాత్రికుల కోసం రోడ్డు, మరుగుదొడ్లు శాశ్వత నిర్మాణాలకు ప్రస్తుతం పాలకమండలి ట్రస్టు బోర్డు ఛైర్మన్ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్ణయించారు. శివరాత్రిలోపు ఒక మార్గం గుండా కాకుండా, మరో మార్గం ద్వారా రాకపోకలకు తాత్కాలిక ఏర్పాటుకు ప్రయత్నించే సమయంలో ఇది అటవీ ప్రాంతమని, ఇలా చేయకూడదని అటవీశాఖ కొర్రీలు వేసింది. అయితే ఈ దారి నిర్మాణం తాత్కాలిక మార్గమేనని ఒప్పించారు. అయితే మరుగుదొడ్ల నిర్మాణానికి ఇక్కడ గిరిజనులు ఒప్పుకోవడం లేదు. శుక్రవారం ఇక్కడ మరుగుదొడ్ల ఏర్పాటుకు పాలకమండలితో పాటు దేవాదాయశాఖ ఇఒ నాగేంద్ర పనులకు శ్రీకారం చుట్టారు. కానీ తమ భూముల్లో మరుగుదొడ్లు కడితే ఒప్పుకోమని గిరిజనులు అడ్డుకున్నారు. అటవీశాఖ కంచె కూడా ఏర్పాటు చేసింది. దీంతో ఏంచేయాలో పాలకమండలికి అయోమయంలో పడ్డారు. రక్షిత తాగునీరు ఇచ్చేందుకు బోర్లు ఏర్పాటు చేయాలని చూసినా అవీ కొలిక్కి రావడం లేదు. గతంలో ఏర్పాటు చేసిన బోర్లు ఉన్నా అవి మరమ్మతులకు గురికావడంతో చుక్కనీరు రాక ఇబ్బందులు పడుతున్నారు. పుణ్యగిరి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలనీ ఛైర్మన్ రామకృష్ణ, మాజీ ఛైర్మన్ గార్లపాటి సత్యసాయి, బోర్డు సభ్యులు కోరుతున్నారు.


మరుగుదొడ్లు కట్టకుండా అటవీశాఖ అడ్డంగా వేసిన కంచె

హెచ్‌ఐవి బాధితులందరికీ హెపటైటిస్-బి

ప్రజాశక్తి-విజయనగరం

హెచ్ఐవి బాధితులందరికీ హెపటైటిస్-బి వ్యాక్సిన్ వేయాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ వై.కామేశ్వర ప్రసాద్.. సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో హెచఖ్ఐవి సెంటీనల్ సర్వేలైన్స్ విధానాన్ని పరిశీలించేందుకు గురువారం రాష్ట్ర కోఆర్డినేటర్ పి.రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన జిల్లాకు వచ్చారు. ఘోషా ఆస్పత్రిలో ఉన్న హెచ్ఐవి సెంటీనల్ సర్వేలైన్స్ సైటు సెంటర్‌ను తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందిని కలిసి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరువాత జిల్లా కేంద్రాస్పత్రిలో ఉన్న ఎఆర్‌టి సెంటర్‌లో నిర్వహిస్తున్న హెపటైటిస్-బి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎఆర్‌టి సెంటర్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమములో జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి జె. రామేశ్వరి ప్రభు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎం.వరలక్ష్మి, పి.బాలాజి, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎపిడి కామేశ్వ ప్రసాద్

నేటి నుంచి జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శుక్రవారం నుంచి ఈ నెల 28 వరకు జనసేనపార్టీ చేపట్టబోయే మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు ఒక ప్రకటనలో కోరారు. క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జనసేన నాయకులు, జన సైనికులు,వీర మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జనాల్లోకి వెళ్లాలంటే క్రియాశీలక సభ్యులదే కీలకపాత్ర పేర్కొన్నారు. రూ.500 రుసుముతో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నవారికి ప్రమాదంలో మరణిస్తే 5 లక్షల రూపాయల ప్రమాద బీమా, గాయపడిన వారికి 50 వేల రూపాయల మెడికల్ ఖర్చులు అందించే ఏకైక పార్టీ జనసేన మాత్రమేనని తెలిపారు.

బడ్జెట్‌లో ముస్లిములకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - విజయనగరం కోట

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ముస్లిములకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ సెల్ వైస్‌ఛైర్మన్ హసన్ షరీఫ్ దుయ్యబట్టారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని అన్నారు. బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీ వర్గాలపై వివక్షత చూపుతోందన్నారు. బడ్జెట్లో మైనార్టీ వర్గాల నిధులు కేటాయింపులో భారీగా కోత విధించారని వాపోయారు గత వార్షిక బడ్జెట్లో రూ.5.020 కోట్లు కేటాయిస్తే, ఈ ఆర్థిక సంవత్సరానికి నామమాత్రంగా రూ.10కోట్లు కేటాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను ఒకసారి పరిశీలించి అందరితో సమాన హక్కు కల్పించాలని కోరారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, రాష్ట్ర ఎపిసిసి ఎగ్జిక్యూటివ్ నెంబర్ షేక్ ఖలీల్, సిటీ మైనారిటీ అధ్యక్షులు ఖాదర్ హాజీ, సిటీ మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ మబ్బులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల్లో మనోధైర్యం నింపాలి

డిప్యూటీ మేయర్ శ్రావణి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వికలాంగులు, బుద్ధిమాంద్యంతో బాధపడే వారికి మనోధైర్యం నింపే ప్రయత్నం చేయాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. గురువారం నగరంలోని కళ్యాణనంద భారతి నగర కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో బుద్ధిమాంద్యం గల వికలాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులే అత్యున్నత ప్రతిభాపాటవాలు ప్రసాదిస్తారని, అందుకే వారు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తారని చెప్పారు. భవిత కేంద్రానికి శాశ్వత భవన నిర్మాణంపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్ గాదం మురళి, ఎంఇఒ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ సమగ్ర శిక్ష, విద్య శాఖ ద్వారా వికలాంగ విద్యార్థులకు అందుతున్న సేవలను తెలియజేశారు. అనంతరం సుమారు రెండు లక్షల విలువ చేసే రెండు సిపి చైర్లు, నాలుగు వీల్ చైర్లు, 16 వినికిడి యంత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య జిల్లా సమన్వయకర్త ఎస్. సూర్యారావు, ప్రధానోపాధ్యాయులు ఆర్.అప్పారావు, సహిత విద్య ఉపాధ్యాయులు ఎన్.బంగారు నాయుడు, ఎస్.రాజేశ్వరరావు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని తెన్నుబొడ్డవరలో డాక్టర్ వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలురు, బాలికల ఎంపిక పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురాజు మాట్లాడుతూ యువత పెడదోవ పట్టకుండా క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పోటీలలో 70 మంది బాల, బాలిక పాల్గొన్నారని పీడీ శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో జాతీయస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఇందుకూరి సుబ్బలక్ష్మి, ఎంఇఒ పి.సత్యనారాయణ, స్కూల్ ప్రిన్సిపల్ కె.రమేష్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.భార్గవ్‌రామ్, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఒక రియల్ ఎస్టేట్ సంస్థ లేఅవుట్ వేసిందని ముంజేరు గ్రామానికి చెందిన పిడుగు నాగరాజు తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంజేరు పంచాయతీ పరిధిలోని గాబువానిపేట, మెట్ట సబ్బన్నపేట గ్రామాల పరిధిలో ఒక సంస్థ లే అవుట్ వేసిందని అన్నారు. ఈ సంస్థ ప్రభుత్వ భూములు, వాగులు, గెడ్డలు, పోరంబోకు భూములు ఆక్రమించిందన్నారు. ఆ భూముల్లో లే అవుట్‌కు సంబంధించిన రహదారులు, పార్కులు, సైట్లు వేసి అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి ప్రభుత్వ భూములు కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - భోగాపురం

యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పడాల చంద్రశేఖర్, కార్యదర్శిగా ఆళ్ల వైకుంఠరావు, గౌరవ అధ్యక్షులుగా రాములప్పుడు, కోశాధికారిగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా పద్మజ, ప్రకాష్ రావును ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా కె.ప్రసాదరావు, ఎన్నికల అధికారిగా ప్రసన్న కుమార్ వ్యవహరించారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్న తీరును ఖండించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, సక్రమంగా వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు మంజూరు విషయమై భవిష్యత్ పోరాటాలు చేపట్టాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఆర్‌టిసి ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని జోనల్ ఛైర్‌పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. గురువారం కొండవెలగాడలో ఆమె రెండు 700 హెచ్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులు సౌకర్యార్థం సింహాచలం కొండ పై నుండి విజయనగరం వరకు ఈ బస్సులు నడుస్తాయన్నారు. రాత్రి వేళల్లో కూడా ఈ సర్వీసులు నడుస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్. అప్పలరాజు, సింహాచలం డిపో మేనేజర్ వై. రాజశేఖర్, సిఎస్ఐ కె. ప్రవీణ్ కుమార్, ఆర్‌టిసి సిబ్బంది, వైసిపి నాయకులు కర్రోతు వెంకటరమణ, వాళ్ళే అప్పలనాయుడు, వాళ్ళే సత్యారావు, మొయిద ఆదినారాయణ, కొండవెలగాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యాకమిటి చైర్మన్ బాలి శ్రీనివాసరావు, నాయకులు అట్టాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా భూములు రీ సర్వే

ప్రజాశక్తి-భామిని

మండలంలోని నులకజోడు రెవెన్యూ పరిధిలో ఉన్న భూములు రీ సర్వేను గురువారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బిల్లుమడాకు చెందిన రైతులు దామోదర అప్పడు, మురళి సాహు, తాము గతంలో కొనుగోలు చేసి, సాగు చేస్తున్న భూమి ఆన్ రిజిస్టర్ కాపీ చూపించి, తాము గతంలో భూ యజమాని వద్ద భూమి కొనుగోలు చేశామని, పేదరికం డబ్బులు లేక భూమిని రిజిస్టర్ చేసుకోలేదని అన్నారు. ప్రస్తుతం ఈ భూమిని రీసెర్వేలో తమ పేరు మీద రికార్డు చేయాలనీ సబ్ కలెక్టర్‌ని కోరారు. సదరు భూ యజమాని తహశీల్దార్ వద్ద భూమి మీకు అమ్మినట్టు వాంగుమూలం ఇస్తే, మీ పేరు మీద మర్చివేస్తామని సబ్ కలెక్టర్ బదులు ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే సక్రమంగా నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, సర్వేయర్ రామ్మోహన్, ఆర్ఐ రాంబాబు, విఆర్ఓ జయరాజు, నులకజోడు ఎంపిటిసి బూస బాలకృష్ణ, సాకేటి రామారావు వున్నారు.

తోటపల్లి ఎడమ కాలువ నీరు విడిచి పెట్టాలి

ప్రజాశక్తి- కురుపాం

తోటపల్లి ఎడమ కాలువ నీరు తక్షణమే విడుదల చేయాలని టిడిపి మండల కన్వీనర్ ఎ.మధుసూదనరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం గరుగుబిల్లి మండలం ఖడ్గవలస జంక్షన్ వద్ద పత్రిక విలేకరులతో ఆయను మాట్లాడుతూ ఒక్క కుడి కాలువ ద్వారే నీరు విడిచిపెట్టడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎడమ కాలువ ద్వారా నీరైనా విడిచి పెట్టాలని, పనులైనా చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామని అన్నారు. ఇప్పటికైనా నీటిని విడిచిపెట్టక పోవడం లేదు సరే కదా పనులు కూడా జరగడంలేదని అన్నారు. తక్షణమే రైతుల బాధలను అధికారులు స్పందించి నీరు విడుదల చేయాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అలాగే రైతుల దగ్గర ఉన్న ప్రతి ధాన్యం గింజ కొంటామని చెబుతూ వచ్చిన అధికారులు, అధికార పార్టీ పెద్దలు ఇప్పుడు ముఖం చాటేయడం ఎంతవరకు న్యాయమని, వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల టిడిపి జిల్లా టిడిపి కార్యదర్శి ఎం బి. విజయ్ అంకుశం, జిల్లా టిడిపి బిసి అధికార ప్రతినిధి అంబటి రాంబాబు. టిడిపి జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు కోట సుమన్ పాల్గొన్నారు.

జీవితాలు మార్చేది పుస్తకాలు మాత్రమే

ప్రజాశక్తి- గరివిడి

మన జీవితాలను మార్చేది పుస్తకాలు మాత్రమేనని ఆశయ సంస్థ వ్యవస్థాపకుడు రెడ్డి రమణ అన్నారు. గురువారం స్థానిక శ్రీరామ్ నగర్‌లో డఫ్ అండ్ డం స్కూల్ ఆవరణలో విద్యార్థులకు పుస్తక పఠనం పై అవగాహన కల్పించారు. ఆశయ సేవా సంస్థ, ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో మొబైల్ బైక్ లైబ్రరీ పర్యటన ద్వారా విద్యార్థులకు పుస్తక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మొబైల్ లైబ్రరీ ఇంతవరకు 85 గ్రామాల్లో పర్యటించిందన్నారు. పుస్తకాలు చదవడం ఒక సంస్కృతిగా ప్రోత్సహించాలన్నారు. వీడియోలు చూడడం, వీడియో గేమ్‌లు ఆడటం కన్నా పుస్తక పఠనం మనపై ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు 150 పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రాంపాత్రుడు, హాస్టల్ వార్డెన్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక ఆలయాన్ని సందర్శించిన గొంప

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని తిమిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన వినాయక ఆలయాన్ని టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ గురువారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్, ఎస్.కోట మండల కార్యదర్శి జుత్తాడ రామసత్యం, తెలుగు యువత విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు లంక శ్రీను, వేపాడ మండల అధ్యక్షులు ముక్క రామకృష్ణ, మంగరాజు, బూరెడ్డి సూరిబాబు, విజయబాబు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్య సేవలు

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక గురుకులంలో విద్యార్థులకు వైద్యాధికారి ఎ.ధరణి వైద్య పరీక్షలు చేశారు. 56 మందికి వైద్య పరీక్షలు చేశారు. 12 మందికి చిన్న రుగ్మతలకు చికిత్స చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఆంజనేయులు, హెల్త్ సూపర్వైజర్ ఎంవి రమణ, హెల్త్ అసిస్టెంట్ డి.సత్యనారాయణ, పి.కోమలి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

ఆర్థిక అక్షరాస్యత అవగాహన కల్పించేందుకు గురువారం జాకేరులో ఎపిఎం ఆధ్వర్యాన సదస్సు ఏర్పాటుచేశారు. ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు అప్పలనాయుడు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పరిధిలో గల శ్రీకాకుళం జిల్లా మెలియపుట్టిలోని ఏకలవ్య పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో గానూ తాత్కాలిక పద్ధతి గెస్ట్ టీచర్ ఇంగ్లీష్ టిజిటి ప్రాతిపదికన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిడిఎ పిఒ బి.నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 20లోగా మెలియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్స్ పాఠశాలను పాతపట్నం వైటిసిలో నిర్వహిస్తున్నారని, అక్కడ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు.

భూ రీసర్వేతో సర్వ హక్కులు

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న భూ సమగ్ర రీ సర్వే ద్వారా సర్వహక్కులు పొందవచ్చని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా డ్రోన్ ద్వారా గురువారం మండలంలోని అలజంగి గ్రామ రెవెన్యూలో సర్వే చేపట్టారు. ఈ సర్వేను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ భావితరాలకు వివాదాలు లేని ఆస్తి హక్కు కల్పించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమన్నారు. దానిలో భాగంగా అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూ రీసర్వే చేస్తున్నట్లు చెప్పారు. దళారీ వ్యవస్థకు స్వస్తి పలుకుతూ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, అవినీతికి తావులేకుండా భూ సర్వే చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. అధునాతన టెక్నాలజీ వినియోగించి భూ సర్వే చేపట్టడంతో అవకతవకలు జరగవని, దీనికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేజేటి భద్రమ్మ, ఉప సర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు, ఎఎంసి డైరెక్టర్ అల్లు త్రినాథ, ఉప తహశీల్దార్ గౌరీశంకర్రావు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, వైసిపి నాయకులు పూడి చిన్న,



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రేజేటి బుజ్జి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిరహిత పాలనే లక్ష్యం

అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని కాశిందొరవలస సచివాలయ పరిధిలోని గొర్లె సీతారాంపురం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు కావాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, వైస్ ఎంపిపి అరసాడ శంకర్రావు, ఎంపిటిసి గొర్లి తిరుపతిరావు, జెసిఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్ రావు, సచివాలయ కన్వీనర్లు పప్పుల అప్పారావు, పప్పుల సత్యం పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

బొబ్బిలి : నియోజకవర్గంలో ప్రస్తుతం మిగిలి ఉన్న ధాన్యం కొనుగోలులో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దళారులు, టిడిపి నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం కోసం రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

వ్యక్తిగత విమర్శలు సిగ్గుచేటు

ఎమ్మెల్యే శంబంగిపై బేబినాయన ఆగ్రహం

ప్రజాశక్తి-బొబ్బిలి

ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరితే, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన వ్యాఖ్యానించారు. కోటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తాను కోరితే ఎమ్మెల్యే శంబంగి వ్యక్తిగత విమర్శలకు దిగడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. తనను గోకితే మిమ్మల్ని బక్కురుతానని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా కళ్లాల్లో ధాన్యం బస్తాలు దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

'కణితి'కి ఎంపిపి పరామర్శ

ప్రజాశక్తి-వేపాడ

ప్రమాదంలో కాలికి గాయమై, మంచానికే పరిమితమైన బల్లంకి గ్రామానికి చెందిన కణితి సోమనాథాన్ని ఎంపిపి డి.సత్యవంతుడు గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

వేపాడ : మండలంలోని సోంపురం, అరిగిపాలెం పాఠశాలలను గురువారం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పి.బాలభాస్కర్ పరిశీలించారు. రికార్డులను పరిశీలించి, సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.

నల్లబల్లిలో ఎడ్ల పరుగు పోటీలు

వేపాడ : మండలంలోని నల్లబల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి తీర్థం సందర్భంగా ఎడ్ల పరుగు పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీలో 16 బళ్లు పాల్గొన్నాయి. విజేతలకు సర్పంచ్ నగదు బహుమతులు అందజేశారు.

రేషన్ పంపిణీపై పర్యవేక్షణ

వేపాడ : మండలంలోని గుడివాడ గ్రామంలో ఉచిత రేషన్ పంపిణీని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ గురువారం పర్యవేక్షించారు. రేషన్ సక్రమంగా అందుతున్నదీ, లేనిది ఆరాతీశారు. లబ్ధిదారులు ఇచ్చిన సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్ పాల్గొన్నారు.

మునగ మొక్కలు పంపిణీ

వేపాడ : మండలంలోని సింగరాయి గ్రామంలో సర్పంచ్ ఎన్.వెంకట్రావు గ్రామస్తులకు ఉచితంగా మునగ మొక్కలు పంపిణీ చేశారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో గురువారం క్షయ వ్యాధిగ్రస్తులకు జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎ.ధరణి, సిహెచ్ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని గుజ్జంగివలస గ్రామంలో ఇటీవల గ్రామస్తులు జ్వరాలు బారినపడిన సంగతి తెలిసిందే. దీంతో సర్పంచ్ రెడ్డి పద్మావతీ ఆధ్వర్యంలో తెట్టంగి ప్రభుత్వ వైద్యాధికారులు గురువారం గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో గత కొద్ది రోజులుగా గ్రామ ప్రజలు జ్వరాలతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. 43 రోగులకు చికిత్సలు నిర్వహించారు. వీరిలో ముగ్గురికి జ్వరాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అవసరమై రోగులకు మందులు పంపిణీ చేశారు. ముగ్గురికి ర్యాపిడ్ టెస్ట్ చేసారు. నేగిటీవ్ రావడంతో సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కళ్యాణి గ్రామాన్ని సందర్శించి అక్కడ పరిస్థితి గురించి డాక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన నివేదిక మేరకు రోగులు సంఖ్య పెద్దగా లేకపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి అప్పల నరసయ్య, అట్టాడ అప్పల రాజు, మాజీ సర్పంచ్ వెంపడాపు సూర్యనారాయణ, వైద్యాధికారి మహ్మద్ అకిబ్, అరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్పల ఊబిలో ఏపి

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట


జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో మొండివీధి, నూకాలమ్మ గుడి, మోపాడ వీధిల్లో గురువారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమం పేరు చెప్పి ప్రభుత్వం ప్రజలను దోచుకొంటుందన్నారు. సిఎం జగన్ చేతకానితనం వల్లే రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.మల్లేశ్వరరావు, బి.అరుణ, వై.అక్కునాయుడు, ఆర్.రమణ, ఎం.చిన్న కృష్ణ, జి.లక్ష్మి, జి.బంగారు నాయుడు, అల్లూరి సత్తిబాబురాజు, వసంత సత్యారావు, సరిపల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంటరీ ఫెస్టివల్‌కు అనూష



ప్రజాశక్తి- డెంకాడ

ఈ నెల 23,24 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న నేషనల్ యూత్ పార్లమెంటరీ ఫెస్టివల్ 4వ ఎడిషన్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించేందుకు నీలా అనూష ఎంపికయ్యారు. ఈమె చింతలవలస సమీపంలోని ఎంవిజిఆర్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతుంది. ఈ ఫెస్టివల్ కోసం రాష్ట్రం నుండి ఒక విద్యార్థిని ఎంపిక చేసేందుకు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి స్క్రీనింగ్ పరీక్షను వర్చువల్ మోడ్‌లో నిర్వహించారు. ఇందులో ఆమె మొదటి స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో ముగ్గురు ఉత్తమ వక్తలకు రూ. 2 లక్షలు, రూ. 1.50 లక్షలు, రూ.1లక్షతో పాటు మెరిట్ సర్టిఫికేట్ బహుకరించ నున్నారు. అనూషను ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసీ శేఖర్, స్టూడెంట్స్ డీన్ ఎస్ మోహన్ కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ షణ్ముఖరావు అభినందించారు.




బోరు పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

జగనన్న కాలనీలో బోరు ఏర్పాటు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో జగనన్న కాలనీలో నీటి సౌకర్యం లేక నిర్మాణాలు చేపట్టకపోవడంపై 'ప్రజాశక్తి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆ కాలనీలో బోరు ఏర్పాటుకు ఎంపిపి డి.సత్యవంతుడు నిధులు మంజూరు చేసి, గురువారం పనులు ప్రారంభించారు. దీంతో ఇళ్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ వర్క్ ఇన్స్పెక్టర్ కామేష్, వార్డు సభ్యులు గుడ్డు శ్రీను, గ్రామ నాయకులు నూకరెడ్డి తాతారావు, కె.ఆర్ పేట సర్పంచ్ బాలబాబు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్ బి.శ్రీను పాల్గొన్నారు.



బాధితులకు నగదు, సామగ్రి అందిస్తున్న కడగల ఆనంద్

బాధితులకు ఆనంద్ సాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని పెదబూరాడ పేట గ్రామంలో రెండు ఇల్లులు ఇటీవల దగ్ధమైన విషయాన్ని తెలుసుకున్న ఆనంద్ ఫౌండేషన్ అధినేత కడగల ఆనంద్ బాధితులకు ఆర్థిక సాయం అందించారు. గురువారం ఆ గ్రామానికి వెళ్లిన ఆయన బాధితులను పరామర్శించి రూ. 5వేలు ఆర్థిక సాయంతో పాటు బియ్యం ప్యాకెట్లు, బట్టలను ఆనంద్ యువసేన ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద బూరాడపేట గ్రామ పంచాయతీ యువసేన, నాయకులు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని రాణి మల్లమ్మదేవి పార్కు, స్వామివారి వీధి ప్రాంతాల్లో గురువారం కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పర్యటించారు. పార్కును ప్రతిరోజు ఉదయం 6 గంటలకు శుభ్రపరచాలని, జిమ్ సామగ్రిని ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లలు ఆడుకునే ఆటపరికరాలకు మరమ్మతులు చేయించాలని సూచించారు. మల్లమ్మ చెరువు అంచులలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. స్వామి వారి వీధిలో ఉన్న ఖాళీ స్థలాలు అన్నింటిలో ఉన్న చెత్తను ఏరివేయించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని ఒమ్మి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, నవ ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. గురువారం ఎఒ ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకముందు సంఘ సభ్యులు, రైతులు, సచివాలయం సిబ్బందితో ర్యాలీ చేపట్టారు. ఎఒ పూర్ణిమ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్దతులలో నవధాన్యలు సాగు చేసి భూమిలో జీవ వైవిద్యం పెంచాలని సూచించారు. భూమిలో కార్బన్ శాతం పెంచాల్సిన అవసరం ఉందని రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం తగ్గించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులు సాధించి ఆరోగ్య కరమైన పంటలు పండించి ఎక్కువ దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌టి శ్రీను, విఎఎ హరి, రమణమ్మ, సచివాలయం సిబ్బంది, రైతులు, మహిళ సంఘం సభ్యులు, వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి - గరివిడి

చీపురుపల్లి మండలం, పుర్రెయవలస గ్రామస్తులకు మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ గోవిందరాజులు ఆధ్వర్యంలో గురువారం చెరువు పనులు జరుగుతున్న స్థలంలో నేత్ర, అవయవ దానం, పార్థవ దేహం కూడా దానం చేయుటలో ఆవశ్యకత పై అవగాహన కల్పించారు. తాము కూడా ఈ ఉద్యమంలో ఈ రోజు నుండి భాగస్వాములు అవుతామని, మనిషి మరణాంతరం విలువైన అవయవాలు మట్టి పాలు చేయకుండా ఇంకొకరికి దానం చేసి పలువురు జీవితాలులో ఆనందాలు, వారి ఆయుష్షు పెంచడానికి తోడ్పడతామని గ్రామస్తులు చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలు పై అపోహలు వీడి, దీన్ని ఒక సామాజిక బాధ్యతగా తీసుకొని ఈ మహా క్రతువులో భాగ స్వామ్యం అవడానికి సిద్ధమని, మృతదేహాలు కూడా దానం చేసి మెడికల్ విద్యాలయాలకు అందజేయడానికి తమ బాధ్యతగా సహకరిస్తామని ప్రమాణం చేసి, ప్రమాణ పత్రాలు 54 మంది వరకు గోవిందరాజులుకు అందజేశారు. ఇందులో ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు కూడా పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీ కొట్టిన ఆటో

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని అప్పన్నపాలెం సమీపంలోని జిందాల్ కర్మాగారం వద్ద గురువారం ఉదయం ఆగిఉన్న లారీని ఓ ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో నలుగురు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. దుంబిరిగూడ మండలం కంగారమామిడి గ్రామానికి చెందిన గాల్లోరి అర్జున్ తనకుటుంబ సభ్యులతో ఆటోలో విశాఖపట్నం వెళు తుండగా జిందాల్ కంపెనీ దగ్గర ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో గాల్లోరి అర్జున్, గాల్లోరి నీలమ్మ, గాల్లోరి రత్నప్రియ, దాసరి బాలన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కెజిహెచ్‌కు తరలించారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం



మాట్లాడుతున్న ఎస్ఇబి ఎఎస్‌పి అస్మా పర్వీన్

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మాదకద్రవ్యాలతో విద్యార్థుల బంగారు భవిష్యత్తు అంధకారమవుతుందని ఎస్ఇబి ఎఎస్‌పి అస్మా పర్వీన్ తెలిపారు. మండలంలోని కోమటిపల్లి వద్దనున్న భాస్కర ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఫార్మసీలో గురువారం మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను, అనారోగ్య సమస్యలను, ఆర్థిక పరిస్థితులను విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల చట్టపరమైన శిక్షల గురించి తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన పోస్టర్లు కాలేజీ ఆవరణలో అంటించారు.

వేపాడ : వల్లంపూడి, డబ్బిరాజుపేట కూడలి వద్ద డ్రగ్స్‌పై నివారణ చర్యలపై వల్లంపూడి ఎస్ఐ రాజేష్ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. డ్రగ్స్ బారిన పడితే కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు.

వంగర : మాధక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, వాటికి అలవాటు కాకూడదని ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, పిఇటి రాము పాల్గొన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలోని బిసి హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వి.నాయుడు డిమాండ్ చేశారు. హాస్టల్లో ఇటీవల జరిగిన సంఘటనలో వార్డెన్ నిర్లక్ష్యం కనిపిస్తుందని చెప్పారు. తాగునీరు కూడా కలుషితమైందని, తినే భోజనం కూడా మెనూ ప్రకారం పెట్టడం లేదని చెప్పారు. దీంతోపాటు ఇంటికి పోవాలంటే విద్యార్థుల నుంచి రూ.200 తీసుకొని పంపిస్తున్నారని తెలిపారు.